క్లుప్తంగా

నేడు ప్రమాణస్వీకారం

స్టేషన్ మహబూబ్‌నగర్: ది పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ మహబూబ్‌నగర్ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉదయం 11 గంటలకు అమిస్తాపూర్ సమీపంలోని ఓ గార్డెన్స్‌లో కార్యక్రమం ఉంటుందని బ్యాంకు చైర్మన్ కండె కుమారస్వామి తెలిపారు. బ్యాంక్ మాజీ చైర్మన్ జి.కృష్ణయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. శ్రీకంబగిరి లక్ష్మీనరసింహ్మస్వామి ఉపాసకులు సద్గురు శ్రీ రామ్మోహనస్వామి పాల్గొని ఆశీర్వాచనం ఇస్తారని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఛత్రపతి సాహు మహారాజ్ శతజయంతి

మహబూబ్‌నగర్ రూరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఛత్రపతి సాహు మహారాజ్ శత జయంతిని బీసీ మేధావుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జలజం కళాశాలలో ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్, జలజం కళాశాల డైరెక్టర్ రమేష్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, ప్రతిఒక్కరు రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్నారంటే అది సాహు మహారాజ్ వల్లనే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రహ్లాద్, రవి కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేపూర్‌లో తాగునీటి గోస

హన్వాడ: వేపూర్‌లో తాగునీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. ప్రధానంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో మిషన్‌భగీరథ నీరు సరఫరా లేదు. ఇతర కాలనీలు, సమీపంలోని బోరుబావుల నుంచి వారు నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నాలుగు నెలల నుంచి సమస్య తీవ్రంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వైర్ చోరీ

జడ్చర్ల: మండల పరిధిలోని ఉదండాపూర్ నిర్వాసితులకు సంబంధించి దేవుని గుట్టతండా సమీపంలో ఏర్పాటు చేస్తున్న పునరావాసం ప్రాంతంలో.. గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ స్తంభాలకు బిగించిన 10.5 కిమీల మేర ఎల్టీ కండక్టర్‌ను అపహరించారని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. బుధవారం ఏఈ నరేందర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైక్ అపహరణ

జడ్చర్ల: స్థానిక కొత్తబస్టాండ్ వద్ద ఈనెల 18న తన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని తిమ్మాజీపేట మండలం బుద్ద సముద్రంకు చెందిన రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాష్‌రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి తన బైక్ కనిపించకుండా పోయిందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి వివరించారు.

చెంచు ఈశ్వరమ్మను ఆదుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): చెంచు ఈశ్వరమ్మను ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమెను దుర్మర్గంగా చిత్ర హింసలకు గురి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

కరపత్రం విడుదల

జడ్చర్ల: మాదిగ అమరవీరుల సంస్మరణ సభ కరపత్రాలను బుధవారం తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో విడుదల చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ మాట్లాడారు. వచ్చే నెల 7న హైదరాబాద్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. శ్రీధర్, దాసు, డేవిడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్, శ్రీను, శివదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ మేరకు ప్రైవేట్ విద్యాసంస్థలు ముందుగానే పాఠశాలకు సెలవు ప్రకటించాయి. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో తరగతులు కొనసాగుతుండగా నాయకులు ఆపివేయించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వినతుల స్వీకరణ

నవాబుపేట: మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి ఆధ్వర్యంలో.. మండల కేంద్రానికి చెందిన నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశం కల్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం జేకే ట్రస్టు ద్వారా నిరుద్యోగుల వినతులు స్వీకరించారు. మూడు రోజుల పాటు నిరుద్యోగ యువతి, యువకుల నుండి వినతులు స్వీకరించి వారి వారి అర్హతలు బట్టి వివిధ కంపెనీలలో అవకాశం ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు తెలిపారు. కాగా బుధవారం ఒక్కరోజే వంద వరకు దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సుధాకర్‌చారి, పుట్టి అంజనేయులు, బాను, పెంటయ్య, వెంకటయ్య, శ్రీను, రాములు తదితరులు ఉన్నారు.

ఎవరికి దక్కేనో..?

- నవాబుపేట పరిధిలో రెండు నామినేటెడ్ పదవులు
- ప్రయత్నాలు ప్రారంభించిన ఆశావహులు


పర్వతాపూర్ మైసమ్మ ఆలయం వ్యూ

నవాబుపేట: కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలోని నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండగా అప్పట్లో వంతుల వారీగా పలువురు ఈ పదవులను దక్కించుకోగా ప్రస్తుతం.. అవి ఎవరికి దక్కేనోనన్న ఉత్కంఠ నెలకొంది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి నామినేటెడ్ పదవుల భర్తీకి శ్రీకారం చుడుతున్నా నేపథ్యంలో మండల పరిధిలో పలువురు వాటిని దక్కించుకునేందుకు చర్యలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా నవాబుపేట మండలానికి సంబంధించి రెండు నామినేటెడ్ పదవులు ఉన్నాయి. వాటిలో ఒకటి పర్వతాపూర్ మైసమ్మ ఆలయం చైర్మన్ కాగా.. మరొకటి మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఉన్నాయి.

మైసమ్మ ఆలయానికి సంబంధించి ప్రత్యేకంగా 13 మంది డైరెక్టర్లతో పాటు చైర్మన్ ఉంటారు. కాగా ఆలయం గ్రేడ్ ఇటీవలే పెరిగిన నేపథ్యంలో డైరెక్టర్ల సంఖ్య 6 నుంచి 13కు పెరిగింది. కాగా గతంలో 1989లో కాకర్లపహాడ్‌కి చెందిన రాజేందర్‌రెడ్డి మొట్టమొదటి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆ తరువాత సైతం ఆ గ్రామానికి చెందిన వారే పదవి చేపడుతూ వస్తున్నారు. తాజాగా సైతం గ్రామానికి చెందిన పలువురు పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో గతంలో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన ఓ వ్యక్తి సైతం ఉన్నట్లు సమాచారం. అయితే ఆలయ గ్రేడ్ పెరిగిన నేపథ్యంలో చైర్మన్ పదవి సైతం ఒక గ్రామానికే పరిమితం చేయకుండా మండలస్థాయిలో నేతలకు కట్టబెట్టాలన్నా ప్రతిపాదనలు ప్రసుత్త ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముందు ఉన్నట్లు సమాచారం. కాగా సంచలనాలకు మారుపేరుగా మారిన ఆయన అనుకుంటే ఆనవాయితీ మారే అవకాశమూ లేకపోలేదని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఆసక్తి నెలకొంది.

వ్యవసాయ మార్కెట్ యార్డులో..

మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డును గతంలో కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు 5 గురు చైర్మన్‌లు పదవి చేపట్టారు. వారిలో ఒకే వ్యక్తి మాత్రమే కాంగ్రెస్ హయాంలో చైర్మన్‌గా ఉండగా.. మిగతా వారు బీఆర్‌ఎస్ పాలనలో చైర్మన్‌లుగా బాధ్యతలు నిర్వహించారు. కాగా బీఆర్‌ఎస్ హయాంలో చైర్మన్ పదవి రిజర్వేషన్ల ప్రకారం ఆశావహులకు కట్టబెట్టారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ విషయంలో రిజర్వేషన్ల ప్రక్రియా కొనసాగిస్తూ మార్కెట్ చైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించింది. దీంతో మండల కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు మండలంలో ఇతర గ్రామాల నుంచి సైతం కాంగ్రెస్ నాయకులు చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే మాత్రం మండల కేంద్రానికి చెందిన వ్యక్తులకు ప్రాధాన్యం ఇస్తామని కాంగ్రెస్ క్యాడర్‌కు వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎవరికి పదవి దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.



బాలకార్మికుల గుర్తింపునకు ఆకస్మిక తనిఖీలు


స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్ విజయేందిర ఇతర అధికారులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బాల కార్మికులు పనిచేసే ప్రాంతాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బాలకార్మికులపై ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యంగా హోటళ్లు, నిర్మాణ రంగం, భిక్షాటన, ఇటుక బట్టీలు, ప్రమాదకరంగా పనిచేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేపట్టాలన్నారు. బాల కార్మికులను గుర్తిస్తే పనిలో నియమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాల, బాలికలు పాఠశాలల్లో చదువుకునేలా చూడాలన్నారు. 5– 18 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకున్నా.. లైంగికంగా వేధించినా.. చైల్డ్ లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098కి సమాచారం అందించాలని చెప్పారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ, పరిశ్రమలు, విద్య, బాలల సంరక్షణ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో జిల్లా, మండల మహిళా సమాఖ్యల ద్వారా బాలల సంరక్షణ, బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తప్పిపోయిన, నిరాదరణకు గురైన, పనిలో ఉన్న బాల కార్మికులను గుర్తించాలన్నారు. వీటిపై తదుపరి నిర్వహించే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ స్వామి, పరిశ్రమల శాఖ జీఎం బాబు రావు, డీఆర్‌డీఓ నర్సింహులు, డీఎంహెచ్‌ఓ కృష్ణ, సంక్షేమ శాఖ డీడీ పాండు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖాధికారి చత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ విజయేందిర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి ఈవీఎంలు, వీవీప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలించి తిరిగి సీల్ వేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేనిదే ఎవరినీ లోపలికి రానివ్వొద్దని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్డీఓ నవీన్, ఎన్నికల డీటీ జాఫర్, వివిధ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

పీయూలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన


ప్రభాకర్‌రెడ్డితో విద్యార్థులు తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మాదకద్రవ్యాలపై ఎంబీఏ విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పార్మసీ కళాశాల హెచ్‌ఓడీ ప్రభాకర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. యువత మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల అనారోగ్యంతో పాటు అనేక సమస్యలు వస్తాయన్నారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్జున్‌కుమార్, నాగసుధ, మహ్మద్‌ఖాన్, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలతో గిరిజనుల ప్రాణాలకు ముప్పు


మాట్లాడుతున్న మోహన్

మహబూబ్‌నగర్ రూరల్: పిల్లలమర్రి హనుమాన్ తండా గిరిజనుల ప్రాణాలకు ముప్పుగా మారిన ఇటుక బట్టీలు తక్షణమే తొలగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆ ప్రాంత గిరిజనులతో కలిసి ఇటుక బట్టీల వల్ల ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి బట్టీల నుంచి వచ్చే బూడిద, పొగ చిన్నపిల్లల అనారోగ్యానికి కారణమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దశరథ్, మేఘ్యానాయక్, శివ, నరేష్, లక్ష్మణ్, గణేష్, కె.లక్ష్మణ్‌నాయక్, బాలు, విజయ్, సతీష్, నవీన్, రాజేష్, సంతోష్, రాంలాల్, సిద్ధూ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ధర్మాపూర్ శివారులో పగిలిన మిషన్ భగీరథ పథకం మెయిన్ పైపులైన్‌కు చేపట్టిన మరమ్మతు పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈయు.బస్వరాజ్ పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఇక్కడ పైపులైన్ పగిలి పెద్ద ఎత్తున తాగునీరు రోడ్డు పక్క నుంచి వృథాగా వెళ్తున్న విషయం పాఠకులకు విదితమే. స్పందించిన మున్సిపల్ అధికారులు దానిని బాగు చేసేందుకు శతవిధాలా యత్నిస్తున్నారు. అయితే ఒకచోట మరమ్మతు చేస్తే మరోచోట లీకేజీ అవుతుండటంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఇది పూర్తిగా భాగయ్యేందుకు మరి కొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

నోట్ పుస్తకాల అందజేత

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారు ఎందరో ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకున్నారని లాయర్ కృష్ణ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మంగంపేట్ తండా ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అదేవిధంగా తండాకు చెందిన మణిబాయి పలకలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ శాంతీబాయి, హెచ్‌ఎం రంగ్యానాయక్, బాలు, పాండు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక రెండో వార్డు పరిధిలోని లక్ష్మీనగర్‌కాలనీ, ఎనుగొండ తదితర ప్రాంతాల్లో బుధవారం రాత్రి ఫాగింగ్ చేపట్టారు. దోమల నివారణ కోసం ప్రత్యేక వాహనం ద్వారా మున్సిపల్ సిబ్బంది ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

వార్డు ఆఫీసర్‌కు సన్మానం

భూత్పూర్: మున్సిపాలిటీలోని వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బీచుపల్లికి పదవీ విరమణ సందర్భంగా బుధవారం చైర్మన్ బస్వరాజ్ గౌడ్, వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాస్, కమిషనర్ సురేందర్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలోని 9వ వార్డుకు ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయనను ఈ సందర్భంగా కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించారు.

ప్రారంభమైన టోల్‌గేట్ పనులు


కొలతలు చేస్తున్న అధికారులు

గండేడ్: మండల పరిధిలో అంచనపల్లి టోల్‌గేట్ పనులు ప్రారంభమయ్యాయి. వివరాలకు వెళ్తే.. చించోలి మహబూబ్‌నగర్ రోడ్డును జాతీయ రహదారిగా మారుస్తూ విస్తరణ పనులు చేపట్టారు. భూత్పూర్ నుంచి చించోలి మన్నేపల్లి వరకు 192 కిలోమీటర్లకు దీనిని విస్తరించారు. ఈ నేపథ్యంలో భూత్పూర్ నుంచి దుద్యాల వరకు పనులు ప్రారంభమయ్యాయి. కాగా 167 నంబర్ జాతీయ రహదారిగా ఏర్పాటవుతున్నా ఈ మార్గానికి సంబంధించి మండల పరిధిలోని అంచనపల్లి వద్ద టోల్‌గేట్ ఏర్పాటుకు నిర్దేశించారు. కాగా గత శుక్రవారం పనుల ప్రారంభాన్ని రైతులు అడ్డగించారు. కలెక్టర్‌కు సైతం విన్నవించారు. కాగా తహసీల్దార్ నాగలక్ష్మి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య తదితరులు అక్కడ చేరుకొని వారిని సముదాయించారు. బుధవారం సైతం పనులు అడ్డుకునేందుకు యత్నించారు. నేషనల్ హైవే డీఈ రమేష్, తహసీల్దార్, నాయకులు నచ్చజెప్పారు. ఈ క్రమంలోనే పనులు ప్రారంభమయ్యాయి.

పన్నులు తగ్గించాలని వినతి



భూత్పూర్: మున్సిపాలిటీలో ఇళ్లు, వ్యాపార సముదాయాలకు విధించే పన్నులు తగ్గించాలని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, చైర్మన్ బస్వరాజ్, వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాస్‌గౌడ్‌లకు స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. పట్టణంలోని చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మహబూబ్‌నగర్, జడ్చర్లలో కంటే ఇక్కడ అధికంగా పన్నులు వేస్తున్నారని ఆరోపించారు. వాటిని చెల్లించలేక యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణం పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు రాజగోపాల్ రెడ్డి, ఫారూఖ్, శ్రీశైలం, పట్నం శ్రీను, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

కొల్లూర్ పాఠశాలలో అధికారుల విచారణ


వివరాలు తెలుసుకుంటున్న ఏఎంఓ శ్రీనివాస్

నవాబుపేట: కొల్లూర్ పాఠశాలలో అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు బడిలో నిద్రపోవటం, పాఠశాలకు కిలోమీటర్‌కు పైగా దూరంలో ఉన్న గ్రామ సమీపంలో దాబాల చెంత తిరగటం లాంటి విషయాలు పత్రికల్లో రావటం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం నేపథ్యంలో చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ కొల్లూర్ పాఠశాలను తనిఖీ చేసి విషయంపై ఆరాతీశారు. అదేవిధంగా విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. అనంతరం హెచ్‌ఎంతో సైతం ఉపాధ్యాయుల హాజరు తదితర విషయాలు ఆరాతీసి రికార్డులు పరిశీలించారు. కాగా తాజాగా పత్రికలలో వస్తున్న వార్తల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ఆదేశాలతో తాను విచారణ చేపట్టినట్లు ఏఎంఓ వివరించారు. విచారణకు సంబంధించి పూర్తి నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ జనార్దన్, హెచ్‌ఎం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ అధికారులతో ఎన్‌ఆర్‌ఈజీఎస్, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, త్రాగునీటి సమస్య వంటి పలు సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అడిగిన ప్రతికూలికి ఉపాధిహామీ పని కల్పించాలని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనను పూర్తిచేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల కొత్తవాటికి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అదేవిధంగా రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో శానిటేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నజీర్‌హైమద్, వ్యవసాయాధికారి రాంపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం


సమీక్షలో చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వార్డు నం.21, 22లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం కృష్ణానగర్ కాలనీలో డ్రెయినేజీ, మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని కల్వర్టుపై సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్లు రష్మిత, రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

అనంతరం తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సమీక్షించారు. త్వరలోనే కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నందున పట్టణంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యంగా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు. కాగా, ధర్మాపూర్ శివారులో మెయిన్ పైపులైన్‌కు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని, దానిని శాశ్వత ప్రాతిపదికన బాగు చేయాలన్నారు. అలాగే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి రావాల్సిన అద్దె బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, ఎంఈయు.బస్వరాజ్, ఏఈలు సాయిరాం, వైష్ణవి, హరికృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన వారోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీఅన్నమయ్య వాణి లలిత సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు గద్వాల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో స నిర్వహిస్తున్న శ్రీవనమాలి పాదపద కవితా తాతా సంకీర్తనా చతుర్థ వారోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అహోబిలం ప్రధాన అర్చకులు సేతురామన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శ్రీవనమాలి పాదపద కవితా తాతా సంకీర్తనా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అభినందనీయం అన్నారు.



ఉర్సు పోస్టర్ల ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రముఖ మతగురువు హైదరాబాద్‌కు చెందిన షహెజాదే గౌసే ఆజం హజ్రత్ పీర్ సయ్యద్‌షా కాజిం పాష ఖాద్రీ రహెమతుల్లాఅలై 4వ ఉర్సు వచ్చేనెల 1న ఉంటుందని.. బజ్మె అంజుమనే ఖాద్రీయ కాజ్మియ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ పాష ఖాద్రీ తెలిపారు. ఈ మేరకు షాసాబ్‌గుట్టలో గల హజ్రత్ మర్దాన్‌అలీ దర్గా ఆవరణలో ఉర్సు పోస్టర్లను పీఠాధిపతి సయ్యద్ రజాక్‌షాఖాద్రీ, కొత్తకోటకు చెందిన మౌలానా అబిద్ హుస్సేన్, మౌలానా షహదత్ హుస్సేన్ ఆవిష్కరించారు. జహంగీర్‌పాష ఖాద్రీ పీఠాధిపతి సయ్యద్‌షా ఆలే ముస్తఫా ఖాద్రీ అలీపాష ఆధ్వర్యంలో వేడుకలు ఉంటాయన్నారు. మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 9949301171, 9966937506, 8247698195 నంబర్లను సంప్రదించాలని కోరారు. అఫ్రోజ్‌షా, వాసిఫ్‌షా, వారిస్‌పాష, మీర్ షోయబ్‌అలీ, ఇలియాజ్ ముజాహిద్ ఖాద్రీ, ఖాజామైనద్దీన్ ఖాద్రీ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్త కేతావత్ కమలమ్మకు పార్టీ విభాగం నుంచి వచ్చిన ఇన్సురెన్స్ మంజురైంది. కాగా బుధవారం ఆయన నివాసంలో సంబంధిత రూ. 2 లక్షల చెక్కును బాధిత కుటుంబసభ్యుడు కేతావత్‌శంకర్‌కు ఆయన అందజేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్ అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, నవకాంత్, సతీష్ పాల్గొన్నారు.

చదువుకు సహకారం

కాకర్లపహాడ్‌కి చెందిన విజయకుమార్ చదువుకు శాంత నారాయణ చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందిస్తోంది. రెండేళ్ల క్రితం మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫతేపూర్ పర్యటించగా.. చదువుకోవాలని ఉందని ఆయనను విజయకుమార్ కోరాడు. దీంతో స్పందించిన ఆయన ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించి, హాస్టల్ సౌకర్యం కల్పించారు. ఈసారి సైతం పుస్తకాలు, ఇతర సామగ్రి తదితరాలను ఆయన అందించారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తాం


ఆంజనేయస్వామి భారీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నాయకులు

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం... స్వామివారి భారీ విగ్రహాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎంపీటీసీ సుగుణ, వెంకటయ్య విగ్రహాన్ని తమ ఖర్చుతో ఏర్పాటు చేశారు. ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి సన్నిధిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఆధ్యాత్మికత చేకూరిందని ఎమ్మెల్యే అన్నారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం వారు ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో టీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కోన రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జవహర్, గోవర్ధన్, గోపాల్, ఉసేనప్ప, వెంకటేశ్, భరత్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.